కరాటే పోటీల్లో రిషిసాయి అద్భుత ప్రతిభ

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో మెలుపాక గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కొత్తపల్లి రిషి సాయి కరాటే పోటీల్లో అద్భుత ప్రతిభ కనపర్చాడు.విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో జరిగిన ఇంటర్ నేషనల్ కరాటే కంపిటేషన్లో రెండు గోల్డ్ మెడల్స్,బ్లాక్ బెల్ట్ సాధించాడు.ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదగా అందుకున్నాడు.మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి నర్సింగరావు కుమారుడు కొత్తపల్లి ఉమాశంకర్,రాణి దంపతుల కుమారుడు 14ఏళ్ల కొత్తపల్లి రిషి సాయి విశాఖపట్నంలోని శ్రీ భావన విద్యనికేతన్ స్కూల్లో 9వ తరగతి చదువుచున్నాడు.నిజ షాటకన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ కోచ్ ఎస్పీఎండీ నాయుడు దగ్గర కరాటేలో శిక్షణ పొందుతున్నాడు.కరాటే పోటీల్లో సత్తాచాటి బంగారు,వెండి పతకాలను కైవసం చేసుకున్న రిషిసాయిని పలువురు అభినందించారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగు నిర్వహించాలి

కలెక్టర్ విజయ్‌కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఉత్తరాంధ్ర ద్వైవార్షిక ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల కొరకు నియమించబడిన పీఓలు, ఏపీఓలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగు నిర్వహించాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఎన్నికల ప్రక్రియను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఎటువంటి సందేహాలు ఉన్నా, వాటిని వెంటనే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణలో వ్యవధి ఎక్కువగా పట్టే అవకాశం ఉన్నందున ఓపిగ్గా, సంయమనం పాటిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. చిన్నపాటి తప్పిదానికి కూడా తావులేకుండా పోలింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తిం చాలన్నారు. పోలింగు ప్రక్రియ బాధ్యత మొత్తం ప్రిసైడింగు అధికారిదేనని, డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగు కేంద్రంలో సిబ్బంది వారికి కేటాయించిన విదులను సక్రమంగా నిర్వహించాలని, ఓటరు గుర్తింపు, నమోదు, సిరామార్కు, బ్యాలెట్ పేపరు అందజేయడం, తిరిగి తీసుకోవడం వంటి పనులు క్రమపద్ధతిలో నిర్వహించాలని తెలిపారు. ఓటరు ఓటు వేయుటకు పోలింగు సామగ్రితోపాటు అందజేసిన పెన్ను మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారులు డి.పి.ఆర్.సి. జిల్లా కోర్డినేటరు నాగలక్ష్మి, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు ఎస్.వి.ఎస్.ఎస్. నాయుడు, డిప్యూటీ తహశీల్దారు పి. అరుణ చంద్ర ఎన్నికల నిబంధనలు మరియు పోలింగు విధానం, బ్యాలెట్ బాక్సులు నిర్వహణపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడి స్థాయిలోనే పిల్లలకు విద్య పై అవగాహన కల్పించాలి

డిప్యూటీ డిఈఓ పెన్నాడ

విశాలాంధ్ర-యస్.రాయవరం: అంగన్వాడి స్థాయిలోనే పిల్లలకు విద్యపై అవగాహన కల్పించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలో ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలోనే పిల్లలకు విద్య గురించి సమాజంపై అవగాహన కల్పించే విధంగా అంగన్వాడి కేంద్రాలు నుంచి ప్రారంభించాలని విద్యాశాఖ ,మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు .జాతీయ విద్యా విధానం 2020 చట్ట ప్రకారంగా పాఠశాలలో చేరే విద్యార్థులకు అంగన్వాడి స్థాయిలోనే పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 స్వప్న ప్రియారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

చెరువును తవ్వేసి అక్రమంగా మట్టిని తరలించి..

- పెదముషిడివాడ కొత్త చెరువులో యదేచ్ఛగా మట్టితవ్వకాలు
- రోజు కొక నాయకుడి పేరుతో కొనసాగతున్న అక్రమ దందా
- పిర్యాదులున్నా పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

చెరువులో మట్టిని తవ్విన ప్రాంతం గోతులుగా ఏర్పడ్డ దృశ్యం

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం పెదముషిడివాడలో రోడ్డు కాంట్రాక్టర్లు యధేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. విజయరాంపురం సమీపంలోని కొత్త చెరువులో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తవ్వేసి తరలిస్తున్నారు. పెదముషిడివాడ - విజయరాంపురం మార్గంలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులకు ఈ చెరువు మట్టిని వినియోగిస్తున్నారు. రెండు వారాలుగా ఈ అక్రమ దందా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు కాంట్రాక్టర్లు నిత్యం రాత్రి వేళల్లో జేసీబీని పెట్టి ఆ మట్టిని రోడ్డు బెర్మలు కప్పుతున్నారు. రాత్రి 12 గంటల నుంచి తెల్లవార్లూ ఏకదాటిగా మట్టిని తవ్వేస్తున్నారు. కొంత మట్టిని రోడ్డుకి వినియోగించగా మరికొంత మట్టిని లారీలతో బయటకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువును ఉష్టానుసారంగా తవ్వేసి మట్టిని మనీగా మార్చుకొంటున్నారు. ఇక్కడ మట్టికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఈ రోడ్డు కాంట్రాక్టర్లు మట్టి వ్యాపారానికి కూడా దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా తన సొంత భూమిలోనైనా మట్టిని తీసుకువెళ్లాలంటే మైన్స్ పర్మిషన్ తీసుకోవాలి. అలాగే చెరువులో మట్టిని తోలుకోవాలన్నా ఇరిగేషన్ అధికారుల పర్మిషన్ తీసుకోవాలి. ఇవేవీ చేయకుండా కాంట్రాక్టర్లు ధర్జాగా చెరువులో మట్టిని తవ్వి అక్రమంగా తరలించుకుపోతున్నారు.

చెరువులో నుంచి తరలించిన మట్టిని రోడ్డు పక్కన వేసిన దృశ్యం

ఈ మట్టి తవ్వకాలతో చెరువులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.ఈ విషయం గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు సరిగా పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పైగా నాలుగు రోజుల క్రితం వీఆర్వో అక్కడికి వెళ్లి అనుమతులపై ప్రశ్నించగా రోడ్డు కాంట్రాక్టర్ వద్ద పనిచేసే సూపర్‌వైజర్ రోజుకొక నాయకుల పేర్లు చెప్పి వారే తవ్వుకోమన్నారని చెప్పారట. తీరా ఆ నాయకునితో సంప్రదించి ఫోన్ కాన్ఫరెన్స్ కలుపగా వెంటనే మాట మార్చి మాజీ ఎమ్మెల్యే గోవిందరావు పేరును ఆ సూపర్వైజర్ తెరపైకి తెచ్చాడట. అయితే ఇదంతా నిజమో కాదో తెలియదు కానీ..నేతల పేర్లు వాడుకుని రోడ్డు కాంట్రాకర్లే ఈ అక్రమ దందాను సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈమట్టి తవ్వకాలపై ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా వారు అందుబాటులోకి రాలేదు. అదే బాటలో రెవెన్యూ అదికారులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతన్న రోడ్డు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చోడవరం ప్రధాన రహదారి పై ప్రవహిస్తున్న మురుగునీరు, వ్యర్థాలు

దోమలు, అంటువ్యాధులతో సహవాసం చేస్తున్న ప్రజానీకం

నిద్రమత్తు నటిస్తున్న పంచాయితీ, రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం రత్నం రెస్టారెంట్, సంజీవని ఆసుపత్రి ల నుండి వదులుతున్న మురుగునీరు బి.ఎన్ రోడ్డు ప్రధాన రహదారిపై ఏరులై ప్రవహిస్తోంది. వీటిని అరికట్టాల్సిన పంచాయితీ, ప్రజారోగ్యశాఖ, రెవెన్యూ అధికారులు నిద్రమత్తు నటిస్తూ చూసి చూడలేనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆసుపత్రి వ్యర్థాలు, మురుగునీరుతో దోమలు, వైరస్ క్రిములతో స్థానిక ప్రజానీకం సహవాసం చేస్తూ పలు అంటు వ్యాధులకు గురికావలసి వస్తోందని మహిళ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. స్థానిక ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలు తరలించేందుకు ఆయా యాజమాన్యాలు, వైద్యులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ప్రజారోగ్యం కుంటుపడుతోంది. రత్నం రెస్టారెంట్లో వ్యర్థాలు మురుగునీరు రోడ్లపై యదేచ్ఛగా ప్రవహిస్తుండడంతో దుర్వాసన, దోమలు, వైరస్ క్రిములు వ్యాప్తి చెంది ప్రజారోగ్యం క్షీణిస్తోంది. పబ్లిక్ శానిటేషన్, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు నిర్లక్ష్యంతో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను రెస్టారెంట్ లో ప్రజలకు సరఫరా చేస్తున్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు, రెస్టారెంట్లు ఇచ్చే లంచాలతో ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు నానా రోగాల బారిన పడుతున్నారు.

దీనిపై జిల్లా ఉన్నతస్థాయి అధికారులు తక్షణమే తగిన శ్రద్ధ తీసుకొని ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిందిగా సిఐటి ప్రజా మహిళ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రోడ్లపై రత్నం రెస్టారెంట్ మురుగునీరు సంజీవని, వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల వ్యర్థాలను తక్షణమే తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడవలసిందిగా కోరుతున్నారు.

గొల్లలపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-కే కోటపాడు: ఈ మండలం కింతాడ శివారు గొల్లలపాలెంలో మంగళవారం సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్ వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 24 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగింది. వీరందరికి విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ లో ఉచితంగా ఆపరేషన్ జరుగుతుందని క్యాంపు కోఆర్డినేటర్ ఆర్ స్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికుమార్, డాక్టర్ వైష్ణవి, పి గీత సాయి, సంతోష్, గాంధీ సంఘ సభ్యులు కన్నూరు అప్పలనాయుడు గ్రామానికి చెందిన పల్ల శ్రీను మంగరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్రమ్మవారి పండగ

విశాలాంధ్ర-పరవాడ: వాదభీపురుపల్లిలో శ్రీ రామచంద్రమ్మ వారి పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు అలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జనసేన మండల పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ మా నవరపు అప్పలనాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వియ్యపు చిన్న, మోటూరు సన్యాసినాయుడు, చింతకాయల ముత్యాలు, బుగిడి రామ గోవిందరావు, కరణం నర్సింగరావు, వెలుగు అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైతు సేవా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-చీడికాడ: మండలంలోని అర్జునగిరి తురువోలు రైతుసేవా కేంద్రాలను మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు విచ్చినాయుడు రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రస్తుతం జరుతున్న 21వ పశు గణన వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు రికార్డులు పరిశీలించారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న 21వ పశు గణన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు సర్వే పూర్తి చేశారు ఏన్ని ఇళ్లను సర్వే చేయాలి దానికి గాను ఏ విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు గ్రామంలో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి డేటా సరిగా తీసుకున్నది లేనిదీ పరిశీలించారు ఇప్పటివరకు మండలంలో 50 శాతం ఆవులు 70శాతం గేదెలు గొర్రెలు మేకలు గణన పూర్తి అయినట్లు ఆయన తెలిపారుఈ కార్యక్రమంలో సిబ్బంది గంగునాయుడు రాజేష్ పాల్గొన్నారు.

..

మిడ్డే మీల్స్ బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర-పరవాడ: మద్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పెండిరగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ పథకం వర్కర్స్ యూనియన్ గౌరవా ధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేసారు. మంగళవారం పరవాడ ఎంఈవో కార్యాలయం ఎదుట మిడ్డే మీల్ నిర్వాహకులు ఆందోళన నిర్వహించారు. ఈ సంధర్భంగా మాణిక్యం మాట్లాడుతూ మూడు నెలల నుంచి బిల్లులు, నెల జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. తక్షణమే బకాయి బిల్లులు చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు అమలు చేయాలని, ఐడీ కార్డు, యూనీఫాం ఇవ్వాలని, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, పనిఒత్తిడి తగ్గించి అక్రమ తొలగింపులు, రాజకీయ వేదింపులు ఆపాలని, గ్యాస్ సిలెండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేసారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎం.వరలక్ష్మి, వై.లక్ష్మి, యడ్ల నారాయణమ్మ, ఎస్.కుమారి, చుక్క దేముడమ్మ, పి.దేముడమ్మ, పి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఏఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-నక్కపల్లి : వాహన దారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సిఐ కుమారస్వామి ఆధ్వర్యంలో నక్కపల్లి పోలీస్ స్టేషన్ నుండి అడ్డరోడ్ వరకు తిరిగి వెదుళ్ళపాలెం జంక్షన్ వరకు సుమారు 100 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా రోడ్డు ప్రమాదాలకు గురై గాయాలు పాలై మరణిస్తున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సన్నిబాబు తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.పి. రమేష్ కు ఎమ్మెల్యే రాజు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-చోడవరం: అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. హైదరాబాదు లోని ఎంపీ రమేష్ నివాస గృహంలో మంగళవారం ఎమ్మెల్యే రాజు కలుసుకున్నారు. ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే రాజు ఎంపీ రమేష్ కు అభినందనలు తెలియజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు వెంకట సత్యనారాయణ, బిజెపి, టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పాయకరావుపేట: అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు పాయక రావుపేటలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. బిజెపి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పి.ఎం.జె.కె.కే.వై. రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బొల్లవరపు రత్న భరత్, బి.జే.వై.ఎం. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆచంట శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కోనే రంగయ్య స్వామి, వేముల వెంకటేశ్వరరావు, దాసరి జగదీష్, కలిగట్ల మూలస్వామి, శివ రామ రాజు, పిల్లి రాంబాబు, మునసాల సూరిబాబు స్వామి, యాదాల శ్రీను, దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పాయకరావుపేట: అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, పాయకరావుపేట అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగం రమేష్, మండల అధ్యక్షులు మంచాల గాంధీ, పట్టణ అధ్యక్షులు కువల కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొనే రంగయ్య స్వామి, ముప్పిన విష్ణు, కో కన్వీనర్ గింజాల వెంకట రమణ, గింజాల అప్పారావు, గొర్ల వెంకట రమణ, దేవర సతీష్ కుమార్, ఎం. రాజు, పడాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గాలమ్మ తల్లి కి ఎమ్మెల్యే పంచకర్ల ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన శ్రీ దుర్గాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో, ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల ను కమిటీ సభ్యులు, కూటమి నేతలు ఘనంగా సత్కరించారు .అలాగే ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి గరిడిలతో , చిటికెల భజనలతో ,మహిళా కోలాటాలతో ,బారీ మందుగుండు సామగ్రి తో పలు సంస్కృతక కార్యక్రమాలు తో తీర్థ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గండి వంశీ ,కూటమి నాయకులు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, కర్రీ కనకరాజు, పిబివిఎస్ఎన్ రాజు, రొంగలి దేముడుబాబు, బోకం సత్యనారాయణ , సీరం అప్పలరాజు ,గండి దుర్గాప్రసాద్, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, ఎం. అక్కుబాబు, లెక్కల అప్పలనాయుడు, మామిడి శంకర్రావు, పడాల వెంకటరమణ, బంతికోళ్ల పద్మా , పెద్దాడ రమణమ్మ, గొర్లి కుమార్, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, గెద్దం రమేష్ ,అయ్యప్ప, కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టర్ ఆఫీస్ నుండి అచ్యుతాపురం వరకు బస్సు సౌకర్యం కల్పించాలి

జిల్లా రవాణా శాఖ ప్రధాన ప్రధాన అధికారికి జనసేన నేత మొల్లేటి వెంకట భోగేష్ వినతి



విశాలాంధ్ర-మునగపాక: విశాఖ కలెక్టర్ ఆఫీస్ నుండి అచ్యుతాపురం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు,జనసేన నేత మొల్లేటి వెంకట భోగేశ్వరరావు జిల్లా రవాణా ప్రధాన అధికారి బి.అప్పలనాయుడు కు వినతిపత్రం అందజేశారు.గత 15 సంవత్సరాల క్రితం 77బి బస్సు గతంలో ఇదే మార్గం ద్వారా ప్రయాణికులను ప్రయాణికులను చేరవేసేదని,ఆ బస్సును రద్దు చేయడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని,తక్షణమే 77 బి బస్సును పునరుద్ధించాలని,విశాఖ కలెక్టర్ ఆఫీస్ నుండి కేజిహెచ్ మీదుగా గాజువాక వయా తానం, ఫార్మాసిటీ, వెంకటాపురం, టి.సిరసపల్లి, తోటాడ,పాటిపల్లి,మునగపాక మీదుగా అచ్చుతపురం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా రవాణా శాఖ అధికారికి ఇచ్చిన వినతి పత్రంలో భోగేశ్వరరావు కోరారు.రైతుల పండించిన వ్యవసాయ ఉత్పత్తులను విశాఖపట్నం గాజువాక వంటి వ్యాపార కేంద్రాలకు తరలించేవారని,ప్రస్తుతం ఈ గ్రామాలకు రవాణా అవకాశం లేకపోవడంవల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని,ఈ విషయమై యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ దృష్టికి తీసుకు రావడం జరిగిందని తక్షణమే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా అధికారికి ఇచ్చిన వినతిలో వెంకట భోగేశ్వరరావు కోరారు.

2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర-యలమంచిలి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు) కొక్కిరాపల్లి యలమంచిలి మండలం నందు 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతికి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం. మాణిక్యం అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు) 5వ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు వరుసగా ఎస్ సి-70, ఎస్ టి-05, బిసి-04, ఓసి-01అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ - ఎస్ సి-35, ఎస్ టి-03, బిసి-02 బిఐపిసి-ఎస్ సి-35, ఎస్ టి-02, ఓసి-01 ఖాళీలు ఉన్నాయని అన్నారు. 5వ తరగతి ప్రవేశానికి వయస్సు 01-09-2012 నుండి 31-8-2016 మధ్య జన్మించి ఉండాలని, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి 31-8-2025 నాటికి 17 సంవత్సరాలు మించకూడదని తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వ ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 సంవత్సరానికి 4వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. %ఖఇజూఎతీఖస్త్రవిఎ.ఖఇజూఎటంం.ఱఅ% వెబ్ సైట్ ద్వారా 06-03-2025 మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష 5 వతరగతికి 06-04-2025 ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష 06-04-2025 (అదే రోజు) మధ్యాహ్నం 2 గంటల నుండి 4 వరకు ఉంటుందని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ ఎం. మాణిక్యం అన్నారు.

53

మండలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఓ

విశాలాంధ్ర-దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో కలిగొట్ల బోయిల కింతాడ, తిమిరం, వాకపల్లి గ్రామాలను దేవరాపల్లి మండల అభివృద్ధి అధికారి ఎం.వి.సువర్ణ రాజు మంగళ వారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్లు ను, అందులో వర్క్ చేస్తున్న సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఆ గ్రామ పంచాయతీ లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు విజిట్ చేసారు.ఆయా గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు.గ్రామాలో శానిటేషన్ కి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.వెలుగు సిబ్బంది ద్వారా కిచెన్ గార్డెన్ యొక్క ఉపయోగాలు ప్రజలుకు అవగాహన కల్పించాలన్నారు.

రఘువర్మ కు మద్దతుగా ఏపీటీఎఫ్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-యస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ మద్దతుగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలో ఎస్. రాయవరం, ఉప్పరాపల్లి తదితర గ్రామాలలో మండల పరిషత్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులను కలిసి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రీ ధర్మారావు అభ్యర్థించారు. అనంతరం కరపత్రాలను వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ ,డి. రమేష్ , వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాజు, ప్రేమ్ కుమార్, భాషా పండితుల సంఘం నుంచి కాశి ,ఏ పి టి ఎఫ్ సీనియర్ నాయకులు జోగి నాయుడు, మండల శాఖ అధ్యక్షులు సునీల్, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ ఆసుపత్రుల్లో ఉన్న డిబి అడిక్షన్ సెంటర్‌ను ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం రాత్రి సందర్శించి పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్సా విధానాల గురించి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కృష్ణ చైతన్య వివరించారు. డి-అడిక్షన్ సెంటర్‌లో అందిస్తున్న వైద్యం, సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు. అలాగే, స్వయంగా రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక చికిత్స పొందే బాధితుల గదిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఎం.వి.కృష్ణ చైతన్య, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, అనకాపల్లి టౌన్ ఎస్ఐ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట వివరాలను ఈ-పంట 'యాప్'లో నమోదు చెయ్యాలి : కలెక్టర్

విశాలాంధ్ర-కె.కోటపాడు : రైతుల పంట వివరాలను ఈ-పంట "యాప్"లో నమోదు చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కె. కోటపాడు మండలం మేడిచర్ల గ్రామంలో పలు ఉద్యానవన పంటలను ఆమె పరిశీలించారు. ఈ-పంట పరిశీలనలో భాగంగా మొబైల్స్ వెలుతురులో ఇదే గ్రామానికి చెందిన రైతు రొంగలి దేముదుకు చెందిన మినుము పంటను పరిశీలించారు. పంట నమోదు వివరాలను ఈ-పంట "యాప్" లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్ రావు కలెక్టర్ కు వివరించారు. పంటను-భూమిని చెక్ చేసే నిమిత్తం రైతు దేముదుతో కలెక్టర్ ఫోటో తీసుకొని అప్ లోడ్ చేశారు. వివరాలు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆ పరిసర భూముల్లో సాగులోఉన్న పిల్లిపెసర, జనుము పంటలను గురించి డి.ఎ.ఒ.మోహన్ రావు కలెక్టర్ కు వివరించారు. పెట్టుబడి, దిగుబడి, రైతులకు ఇచ్చే రాయితీ తదితర వివరాలను కలెక్టర్ అడుగగా జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. రైతులతో పంటల గురించి ఆమె మాట్లాడారు. వ్యవసాయ అధికారులు పనితీరుపై కలెక్టర్ విజయకృష్ణన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె. కోటపాడు తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ సాంబశివరావు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఈఓ లైలాదేవి, వి.ఎ.ఎ.హరీష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలి : ఎస్పీ తుహీన్ సిన్హా

విశాలాంధ్ర-అనకాపల్లి : మహిళా పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై అధికారులను సూచనలు చేశారు.మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకు భద్రత చర్యలు చేపట్టాలన్నారు.మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, భద్రత చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించుటలో భాగంగా మహిళా పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో పోలీసు సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, వారి చెప్పే ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా, విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శించి, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానం పట్ల అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్య కూడళ్లు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను, బస్టాండులు మరియు రైల్వే స్టేషన్‌లను సందర్శించి ప్రజలు, మహిళలు, విద్యార్థినులతో మమేకమై, వారికి అర్థమయ్యే రీతిలో మహిళల రక్షణకు బాసటగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఎస్సైలు యమునా, ఆలీ షరీఫ్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

దొంగతనం కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర-అనకాపల్లి : రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద మాకవరం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఇంటిలో, కాకినాడ జిల్లా పత్తిపాడులో జరిగిన బైక్ దొంగతనం కేసులో ముద్దాయి గంజి మంగారావును సోమవారం మార్టూరు జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్న సీఐ జి. అశోక్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసును చాలెంజిగా తీసుకొని సిసిఎస్ సిఐ కె. అప్పలనాయుడు, ఎస్సై పి. రమేష్ రూరల్ ఎస్సై జి.రవికుమార్ వారి సిబ్బందితో కలిసి కొన్ని క్లూస్ సంపాదించి మాకవరం గ్రామానికి చెందిన గంజి మంగరాజు ఈ కేసులో ముద్దాయిగా గుర్తించి అరెస్టు చేయటానికి వెళుతుండగా పోలీసుల్ని చూసి పారిపోయే క్రమంలో సదరు ముద్దాయిని పట్టుకొని అతనిని విచారించగా అతను తాపీ మేస్త్రి పని చేసే వాడని ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసై అప్పులు చేశాడని అప్పులు తీర్చే క్రమంలో దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడని తెలిపారు. రెండు తులాల బంగారు తాడు, కాకినాడ జిల్లా పత్తిపాడు కు చెందిన యూనికాన్ మోటార్ వాహనం రికవరీ చేసినట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రి 11:00 దాటాక రోడ్డుపై ఎటువంటి పని లేకుండా అనవసరంగా తిరిగే వాళ్ళని స్టేషన్ కి తీసుకువచ్చి కౌన్సిలింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్ కు తరలించినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

తాగునీరు వృధా... సిబ్బందికి పట్టదా?

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో ఉమ్మలాడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో కుళాయి పైపు శిథిలమై త్రాగునీరు వృధాగా పోతున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం,సిబ్బంది నిర్లక్ష్యం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్ను వసూలు చేయడమే కాదు. ఇటువంటి మరమ్మత్తులు చేయవలసిన బాధ్యత మీకు లేదా అని ప్రశ్నించే పరిస్థితికి తెచ్చుకోకుండా వెంటనే సిబ్బంది స్పందించి కుళాయి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా బుదిరెడ్లపాలెంలో శ్రీ అభయాంజనేయ తీర్థం

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం పంచాయతీ శివారు బుదిరెడ్లపాలెం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 5 గంటల నుండి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు ,సింధూరం, తమలపాకలతో ప్రత్యేక పూజలు కమిటీ నిర్వాహకల, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు సంస్కృత కార్యక్రమాలతో తీర్థ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాలెం గ్రామ సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, కనకరాజు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేష్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెదపాటి కళ్యాణి

విశాలాంధ్ర-కశింకోట: అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, పార్లమెంటరీ రైల్వే బోర్డ్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సి. ఎం రమేష్ జన్మదిన సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనకాపల్లి టిడిపి పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు, బీసీ నాయకురాలు పెదపాటి కళ్యాణి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా మేజర్ పంచాయతీ కశింకోట బాల సదన్, బాలుర వసతి గృహాల్లో మంగళవారం సీఎం రమేష్ జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ సీఎం రమేష్ జన్మదినోత్సవ కార్యక్రమాన్ని అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామంలో ఉన్న ఇచ్చా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల వసతి గృహంలో వారి మధ్య కేక్ కట్ చేయించి వారికి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ రమేష్ ఆఫీస్ ఇంచార్జ్ విజయ నాయుడు విచ్చేసి కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు తినిపించారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పార్లమెంటు నియోజకవర్గం అంతా అనేక మంది నిర్వహించడానికి ప్రధాన కారణం సీఎం రమేష్ లాంటి గొప్ప వ్యక్తి అనకాపల్లి ఎంపీగా రావడం అని ఆయన మన ఎంపీ కావడం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఆయన రాకతో పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి శర వేగంగా జరుగుతుందన్నారు. అందుకు ప్రధాన కారణం ప్రధానమంత్రి మోడీకి ఆయన అత్యంత ఆప్తుడు కావడమన్నారు. కేవలం ఆయన మన పార్లమెంటు సభ్యుడిగానే కాకుండా దేశ రాజకీయాలలో కీలక పాత్రను పోషిస్తున్న వ్యక్తి అని తెలిపారు. ఆ విధంగానే మన నియోజకవర్గం అభివృద్ధికి మూల కారణం అన్నారు. ఇలాంటి మహోన్నతమైన వ్యక్తి జన్మదినం పండుగ వాతావరణంలో జరపాలన్న సదుద్దేశంతోనే మన శాసనసభ్యులు రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీల గోవింద సత్యనారాయణ కూటమి నాయకులకు ఈ జన్మదినాన్ని ఘనంగా జరప మని ఆదేశాలు ఇవ్వడంతో మన నియోజకవర్గంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి జిల్లా మహిళా కన్వీనర్ బత్తుల లక్ష్మి, టిడిపి మండల సమైక్య అధ్యక్షురాలు సీరం వెంకటలక్ష్మి, యలమ సంఘం కార్యదర్శి లాలం కన్నాజి, గౌరవ అధ్యక్షులు రాజాన అప్పారావు, బీసీ సంఘం నాయకులు పిల్లల శంకర్, కొల్లి అప్పలనాయుడు, చింతకాయల కొర్లయ్య, బందారు సోమ నాయుడు, చెల్లిబోయిన సింహాచలం, కుంద్రపు తాతబాబు, ప్రసాదు, రమేష్, ఇచ్చా ఫౌండేషన్ నిర్వాహకులు టి.మధు పంతం అరుణ, బాలుర వసతి గృహం వార్డెన్ పి వి ఎస్ రాజ్, బాలసదన్ ఏసిడిపిఓ టి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని అంగన్ వాడి కార్యకర్తలు అందరు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 బి.కాశీ విశ్వేశ్వరరావు, రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎన్.పుష్పాదేవి తెలిపారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది శ్రీ కేపిడి జడ్పీ హైస్కూల్లో ఆరు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఐసిడిఎస్ పిఓ పుష్పాదేవితో కలిసి ఎమ్ఈఓ-2 బి.కాశీ విశ్వేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 బాల్య సంరక్షణ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని,ఈ శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. అంగన్ వాడి కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించడానికి మూడు సంవత్సరాల కాలవ్యవధిలో 120 రోజులు జరుగునున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కార్యకర్తలు అందరికీ విద్యా శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా మొదటి రోజు మంగళవారం తెలుగు, గణితం బోధనపై అంగనవాడి కార్యకర్తలకు డిఆర్పీలు శిక్షణను ఇచ్చారు.ప్రతి అంగనవాడి కార్యకర్త 3 సంవత్సరాల కాల వ్యవధిలో 120 రోజులపాటు శిక్షణ పూర్తి చేసుకోవలన్నారు. అనంతరం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ సర్టిఫికెట్ పొందిన కార్యకర్తల మాత్రమే అంగనవాడిలో చిన్నారులకు ప్రీ ప్రైమరీ తరగతులకు బోధించే అర్హత లభిస్తుంది అన్నారు. శిక్షణ కార్యక్రమానికి మండలంలోని 64 మంది అంగనవాడి కార్యకర్తలు హాజరయి శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పివి శేషు బాబు,సూపర్వైజర్లు రత్నం, సంతోషి కుమారి,కెఆర్పి ఆర్.ఎన్ ప్రసాద్,డిఆర్పీలు దేగల నారాయణ,పీవీ నారాయణ,శేషగిరిరావు, గొలుగొండ శ్రీనివాసరావు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ టీచర్స్‌కు జ్ఞాన జ్యోతిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి-1 ఎస్ లక్ష్మణరావు ,ఎంఈవో- 2 రవీంద్రబాబు, ఐసిడిఎస్ సిడిపిఓ లలిత కుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి ముఖ్య ఉద్దేశం నూతన విద్యా విధానంలో భాగంగా పునాది అభ్యాసన, భాష సంఖ్యాశాస్త్రంలలో సామర్థ్యాన్ని పెంపొందించుటకు అంగనవాడి టీచర్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. దీనివలన అంగన్వాడీలలో చిన్నారులకు పూర్వ, ప్రాథమిక విద్యాభ్యాసం మరింత సులభతరంగా ఉంటుందని తెలిపారు.

మొదట విడత ఈనెల 18 నుండి 20 వరకు, రెండవ విడత 22 నుంచి 25 వరకు రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు , అంగన్వాడి వర్కర్లు, డి.ఆర్.పి లు పాల్గొన్నారు.

పాయకరావుపేట : జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ లో

భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6రోజుల పాటు నిర్వహించే శిక్షణ మంగళవారం ప్రారంభించారు. శిక్షణలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నిపుణ్ భారత్ లక్ష్యాలు, ఐసిసిఈ, ఐసిడిఎస్ ల పాత్ర గురించి రిసోర్స్ పర్సన్స్ హరికృష్ణ, శ్రీను, సతీష్ లు వివరించారు. శిక్షణ ను వినియోగించుకొని అంగన్వాడీలో చక్కని విద్యను విద్యార్థులకు అందించాలని విద్యాశాఖ అధికారులు కే.ఎన్. గాంధీ , జి. రమేష్ బాబు కోరారు.

పెరటి తోట పెంపకంపై మహిళలకు అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలోని స్థానిక మహిళా సమైఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామైక్య సంఘాల సభ్యులకు పెరటి తోట పెంపకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మన ఇంటి పెరట్లోనే సహజ సిద్ధమైనటువంటి కూరగాయలు పండించుకోవడం ద్వారా మెరుగైన ఆహారాన్ని పొందవచ్చునని సూచించారు.క్రిమి సంహారిక మందులు వాడకుండా ఇంటిలో వాడి పారేసే వ్యర్థ పదార్థాల నుండి బయో ఎరువును ఏ విధంగా తయారు చేసుకోవాలో వివరించారు. సహజంగా పండించిన కూరగాయలు వాడకం ద్వారా ఇంటిల్లి పాది ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం టి.రాజబాబు,ఎంజీఎనర్జీఎస్ ఏపీవో వరహాల బాబు,గ్రామాఖ్య సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 సం.ల కఠిన కారాగార శిక్ష, రూ. 3లక్షలు జరిమానా

బాధిత బాలికకు రూ. 10 లక్షల పరిహారం : పోక్సో కోర్టు తీర్పు

విశాలాంధ్ర-సబ్బవరం : 2019లో సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన సబ్బవరం మండలం ,నాయనమ్మపాలెం గ్రామానికి చెందిన ఎర్ర నవీన్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ?3,00,000 జరిమానా విధిస్తూ విశాఖపట్నం పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాలు జూలై 2019లో, బాధిత బాలిక పెందుర్తిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నిందితుడు ఎర్ర నవీన్, తన స్కూల్ స్నేహితురాలైన బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మోసగించి అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. బాధితురాలు పెళ్లి చేసుకోమని నిందితుడిని కోరినా, అతను తిరస్కరించడంతో పాటు అతని తల్లిదండ్రులు కూడా మాకు సంబంధం లేదని చెప్పారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.అప్పటి సబ్బవరం ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీలు కుమారస్వామి,మళ్ల మహేష్ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.విచారణ అనంతరం, విశాఖపట్నం పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి జి.ఆనందని గారు, నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ?3,00,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలల అదనపు సాధారణ జైలు శిక్ష విధించారు. గౌరవ న్యాయస్థానం, బాధిత బాలికకు ?10 లక్షల పరిహారం (?3 లక్షలు నిందితుడి నుండి, ?7 లక్షలు ప్రభుత్వ తరపున) అందజేయాలని బాధితురాలకు తీర్పు ఇచ్చింది.

పోలీసు చర్యలు & అభినందనలు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఈ కేసును ప్రాధాన్యతనిచ్చి దర్యాప్తు పూర్తి చేసి, నేరాభియోగ పత్రం సమర్పించి, కోర్టులో విచారణ త్వరగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. కోర్టు విచారణను వేగవంతం చేసి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి వాదనలు వినిపించారు.సబ్బవరం పోలీసులు, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది సమయానికి సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. దీని ద్వారా నిందితుడికి కఠిన శిక్ష పడేలా దర్యాప్తు నిర్వహించిన అధికారులను, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తిని జిల్లా ఎస్పీ శ్రీతుహిన్ సిన్హా అభినందించారు.

ఇరుకు సందుల్లో బహుళ అంతస్తులు!

- వీఎంఆర్డీఏలో ప్లానింగ్ అధికారుల అత్యుత్సాహం
- 15 అడుగుల రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణానికి ప్లాన్
- మేజర్ పంచాయితీ తుమ్మపాలలో నిబంధనలు గాలికి...

విశాలాంధ్ర-అనకాపల్లి : అటు జీవిఎంసీ చూసిన ఇటు వీఎంఆర్డీఏ చూసిన అంతా దొందు దొందే..ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి వారి స్వప్రయోజనాల కోసం తయారు చేసుకున్న నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ అవకాశం లేనిచోట కూడ అడ్డగోలుగా అనుమతులిస్తూ విమర్శలు మూటగట్టుకుంటున్న వారిలో మార్పురాకపోవడం విశేషం. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా బిల్డర్, నిర్మాణదారుడు ఇచ్చే తాయిళాలకు తలొగ్గి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడమే కాకుండా భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలకు బాధ్యత కూడ వహించాలి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో గల మేజర్ పంచాయితీ తుమ్మపాలలో కేవలం 15 అడుగుల రోడ్డు ఉన్న ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వీధిలో బహుళ అంతస్తుల నిర్మాణానికి వీఎంఆర్డీఏ అధికార్లు ఇచ్చిన అనుమతులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యుడు ఇంటి నిర్మాణం కోసం ధరఖాస్తు చేసుకుంటే సవాలక్ష కారణాలతో ఇబ్బంది పెట్టే అధికారులు బిల్డర్లపై మాత్రం ఎక్కువ మక్కువ చూపుతున్నారు అనే ప్రశ్న సర్వత్రా వ్యక్తం అవుతుంది.నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అనుమతులు ఎలా ఇచ్చారు... బిల్డర్ ప్రలోభాలకు లోనైయి చూసిచూడనట్లుగా వ్యవహరించారా..? తప్పు అని తెలిసినా..అనుమతులు ఎందుకు ఇచ్చారు..? అసలు క్షేత్రస్థాయి పరిశీలన చేశారా..? చేస్తే అనుమతులు ఎలా ఇస్తారు..? ఏమైనా అయితే నేను చూసుకుంటా అని బిల్డర్ బరోషా ఇచ్చారా..? అసలు ఆ రోడ్డులో అనుమతులు ఎందుకు, ఎలా ఇచ్చారో అధికారులు ఖచ్చితంగా సుస్పష్టమైన వివరణ ఇవ్వాలనే డిమాండ్ ఉంది.

-నిబంధనల ఉల్లంఘనలో ఆ బిల్డర్ సిద్ధహస్తుడే...

జీవీఎంసీ, పంచాయితీ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టి నిబంధనలను గాలికొదిలేసి అధికారులను సంతృప్తి పరిచిన ఆ బిల్డర్ అదే పద్ధతిలో వీఎంఆర్డీఏ అధికారులను కూడ సంతృప్తి పరిచి అనుమతులు పొందినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.తీసుకున్న ప్లాన్‌కు అదనంగా అంతస్తులు, ఇరుకు సందుల్లో బహుల అంతస్తుల నిర్మాణమే ప్రధాన అజెండాగా చేసుకొని వ్యాపారం చేస్తున్న సదరు బిల్డర్‌పై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఉల్లంఘనలు,ఆరోపణలు నడుమ తుమ్మపాల పంచాయితీ పరిధిలో 15 అడుగుల రోడ్డులో నిర్మాణదశలో ఉన్న బహుళ అంతస్తుల అనుమతులపై అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పున:పరిశీలన చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపార దృక్పదమే తప్ప నమ్మి ప్లాట్లు కనుగోలు చేసిన వారిని నట్టేటముంచడానికి ఈ బిల్డర్ బరితెగించాడనే ఆరోపణలు ఉన్నాయి.

-అసిస్టెంట్ సిటీ ప్లానర్ వివరణ : ఇరుకు సందుల్లో బహుళ అంతస్తులు నిర్మాణంపై విఎంఆర్డీఏ అసిస్టెంట్ సిటిప్లానర్ అమ్మాజీరావును ఫోన్‌లో వివరణ కోరగా వారం రోజులు తరువాత స్పందిస్తూ ప్లాన్ మంజూరు చేసిన అధికారిని సంప్రదిచానని అక్కడ 27 అడుగుల రోడ్డు ఉందని చెప్పినట్లు తెలిపారు. అయినప్పటికి మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని ఆయన బదులిచ్చారు.

గ్రామదేవతల పండుగలతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

విశాలాంధ్ర-అచ్యుతాపురం : మండలంలో గ్రామ దేవతల పండుగ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు . మంగళవారం నడింపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మదుతూరు గ్రామంలో శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామదేవతల పండుగలతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ యాండ్రా పైడిరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మునగపాక : అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే బోర్డ్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు మంగళవారం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాగులాపల్లి తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయం నందు అభిమానులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకల ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్, మండల ఐటీడీపీ ఇన్చార్జ్ శరగడం యోగి నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆడారి జనార్ధన్, గ్రామ ఉపసర్పంచ్, జనసేన పార్టీ యువ నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు, సూరిశెట్టి శివాజీ పాలమరశెట్టి మురళి, కాండ్రేగుల నాగేంద్ర, మొల్లేటి నారాయణరావు, మొల్లేటి ఆనంద్, మొల్లేటి గణేష్, పెతకంశెట్టి రాజు, గోసాల గోవింద్, పోలమర శెట్టి నాగు, పల్లె నర్సింగరావు, కొయ్య శేషు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడి చిన్మయిదేవి ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర-అనకాపల్లి: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్జేడి చిన్మయిదేవి సోమవారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయాన్ని, ఎన్టీఆర్ ఆసుపత్రి సమీపంలో ఉన్న సఖి వన్ స్టాప్ సెంటర్, జిల్లా బాలల సంరక్షణ కేంద్రాన్ని, శిశు గృహన్ని సోమవారం ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఈకార్యాలయముల పనితీరును ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు ఆమె చెప్పారు. నూతనముగా ఏర్పాటు అయిన వన్ స్టాప్ సెంటర్, డిసిపియు, శిశు గృహల పనితీరుపై ఆమె హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.అనంతలక్ష్మి, డిసిపిఓ ఏమ్ రమేష్ సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎంవీ మంజులవాణి, నోడల్ ఆఫీసర్ ఎల్ సుజాత, ఏసిడిపిఓ శశికళ సీనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్, లైజనింగ్ అధికారిణి జయలక్ష్మి, సకఖి ఒన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో తురకలపూడి అంగన్వాడి సెంటర్ వార్తకు స్పందన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామంలో అంగన్వాడి సెంటర్ -1 ప్రాంగణంలో ఉన్న సమస్యలపై విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురించిన వార్తకు సమగ్ర శిశు సేవ అభివృద్ధి పథకము అధికారిని ఎస్. పుష్ప దేవి ఐసిడిఎస్ రావికమతం ప్రాజెక్టు వారు సందర్శించి అంగన్వాడి సెంటర్ ప్రాంగణంలో ఉన్న జారుడు బల్లలు మొదలైన ఆట వస్తువులు తుప్పు పట్టి ఉండడం వలన వాటిని పిల్లలకు దూరంగా ఉంచమని అంగన్వాడీ కార్యకర్తకు తెలియపరిచారు అదే విధంగా స్కూలు ఆవరణలో మంచినీటి కొళాయి ఉన్నట్లు తెలిపారు తదుపరి గ్రామంలోని ఇంటింటికి మంచినీటి కొళాయి పథకంలో భాగంగా గోతులు తవ్వడం వలన రాళ్లు తేలిపోయి ఉన్నాయని వాటిని సరిచేయమని పంచాయతీ అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులో భాగంగా మంగళవారం రాజయ్యపేట సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈమేరకు ఎంపీడీవో సీతారామరాజు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ 0-6 పిల్లలు స్కూల్ పిల్లలు ఆధార్ నమోదు చేసుకోవాలని ఈ క్యాంపు ల ద్వారా పిల్లల పేర్లు సరి చేసుకోవచ్చని లేదా కొత్తగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని అందువల్ల ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.